క్లుప్తంగా

సిబిల్ స్కోర్ పరిశీలన



ఆరా తీస్తున్న ఎంపీడీవో మహేందర్‌కుమార్

బేల: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో శనివారం రాజీవ్ యువవికాసం దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్‌ను ఎంపీడీవో మహేందర్ కుమార్ పరిశీలించారు. దరఖాస్తుదారు బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, పాన్‌కార్డుల ఆధారంగా సిబ్బంది పరిశీలిస్తున్న సిబిల్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువవికాసం పథకం కింద ఆన్‌లైన్‌లో మండలం మొత్తంగా 1,636 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తుదారుల సిబిల్ పరిశీలన మూడు రోజులుగా కొనసాగుతుందని, ఈనెల 19 వరకు పూర్తి చేయిస్తామన్నారు.

వడదెబ్బ మృతులకు ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌టౌన్: వడదెబ్బ మృతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4లక్షల ఆర్థికసాయం (ఎక్స్–గ్రేషియా) అందించనుందని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ తెలిపారు. వడదెబ్బతో జరిగిన మరణాలకు సంబంధించిన ఆర్థిసాయం పొందాలంటే బాధితుడు వేడి ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఉన్నాడని, వేరే కారణాలు లేవని డాక్టర్లు, ఎమ్మార్వో, పోలీస్‌లు కలిసి రాసిన నివేదికలో నిర్ధారించాలన్నారు. వైద్యులు, ఎమ్మార్వో, పోలీస్ అధికారి సంతకాలతో కూడిన నివేదిక కలెక్టర్‌కు అందించాల్సి ఉంటుందన్నారు. మరణించినవారి ఆధార్ కార్డు కాపీ, మరణించిన రోజు ప్రాంతంలో నమోదైన ఉష్ణోగ్రత, కుటుంబ వివరాలు, మరణ ధ్రువీకరణ పత్రం అందించాలన్నారు. రైతు బీమా ఉన్నవారు రైతుబీమా లేదా వడదెబ్బ సహాయంలో ఏది ఎక్కువ ఉంటే ఆ సాయాన్ని మాత్రమే పొందాల్సి ఉంటుందన్నారు

అనర్హులను జాబితా నుంచి తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఖమర్‌బేగం

ఆదిలాబాద్‌టౌన్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు చోటు కల్పించారని కాంగ్రెస్ మైనార్టీ నాయకురాలు ఖమర్‌బేగం ఆరోపించారు. వారి పేర్లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజుకు వినతిపత్రం అందజేశారు. వార్డు నెంబర్ 44 సంజయ్‌నగర్‌లో ఒక్కో ఇంట్లో ఇద్దరేసి వ్యక్తులకు ఇళ్లు మంజూరు చేశారన్నారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలన్నారు. అనర్హులను తొలగించి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

జొన్న కొనుగోలు కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న ఏఈ రమేశ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి రమేశ్ పరిశీలించారు. జొన్నల కొనుగోలులో రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు జరిగే విధంగా చూడాలని కోరారు. ఆకాల వర్షకాలకు పంట నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం జొన్నల కొనుగోలు చేపట్టాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌హెచ్‌వో



సీఐ స్వామి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో (సీఐ)గా కర్రె స్వామి శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ సీఐగా పని చేసి మావల పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. గతంలో మావల పోలీస్‌స్టేషన్‌కు ఎస్సై ఎస్‌హెచ్‌వోగా వ్యవహరించారు. ఇక నుంచి సీఐ ఎస్‌హెచ్‌వోగా వ్యవహరించనున్నారు. ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఎస్సై విష్ణు వర్ధన్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఉన్నత చదువుకు దూరం

- భీంపూర్‌లో కలగానే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం కేటాయించిన స్థలం

తాంసి: పేద విద్యార్థులకు ఉన్నత చదువులు కలగానే మారుతోంది. భీంపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక మండలానికి చెందిన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ప్రభుత్వ కళాశాల ఏర్పాటు కోసం ప్రతిఏటా విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా మండలవాసులు డిమాండ్ చేస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. భీంపూర్ మండల పదో తరగతి విద్యార్థులు జిల్లా కేంద్రానికి లేదా తాంసి మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలకు వెళ్లాల్సి వస్తోంది. పేద, మధ్య తరగతి పిల్లలు ఫీజులు చెల్లించలేక చదువులకు స్వస్తి పలుకుతున్నారు.

దూరభారం..

జిల్లా కేంద్రంతో పాటు తాంసి కళాశాలకు వెళ్లడం దూరభారం కావడంతో పాటు సరైన రవాణా సౌకర్యం లేక ఇంటర్మీడియట్ విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారు. అమ్మాయిలు ఇంటి వద్ద ఉంటుండగా, అబ్బాయిలు మాత్రం వ్యవసాయ పనులకు వెళ్తూ.. కూలీలుగా మారుతున్నారు. మరి కొందరు జులాయిగా తిరుగుతూ వ్యసనాల బారిన పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.

స్థలం కేటాయించినా..

మండల కేంద్రానికి సమీపంలో గత మూడేళ్ల క్రితం కళాశాల కోసం స్థలాన్ని సైతం గుర్తించారు. స్థలాన్ని గుర్తించి ఏళ్లు గడుస్తున్నా.. కళాశాల ఏర్పాటుకు ముందడుగు పడక విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యాశాఖ అధికారుల నుంచి కూడా కళాశాల ఏర్పాటు కోసం ఎలాంటి ఉత్తర్వులు వెలువడ లేదు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే మండలంలోని పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు మేలు



మండలంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేస్తే మాలాంటి పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. మేం చిన్నప్పటి నుంచి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివాం. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాం. ఇంటర్ చదువాలంటే జిల్లా కేంద్రం, తాంసి కళాశాలలో చేరాల్సిన పరిస్థితి ఉంది.

– రేండ్ల సంజన, విద్యార్థిని, పిప్పల్‌కోటి

చదువు మానేస్తున్నారు



ఇంటర్ కళాశాల లేక పలువురు విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. కళాశాల ఏర్పాటు చేయాలని పలుమార్లు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం. మండల కేంద్రంలో రెండు ఎకరాలు కేటాయిస్తున్నట్లు పంచాయతీ ద్వారా సైతం తీర్మానం చేశాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– లింబాజీ మాజీ సర్పంచ్, భీంపూర్

ఆవులను వధిస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

- డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: బక్రీద్ పండుగ రోజున ఆవులను వధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని పశువుల మాంసాన్ని విక్రయించే వ్యాపారులకు శనివారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవులను వధించడం చట్టరీత్యా నేరమన్నారు. వ్యవసాయానికి ఉపయోగపడని, పశువైద్యులు ధృవీకరించే ఎద్దులను మాత్రమే వధించాలన్నారు. మాంసాన్ని ఎక్కడపడితే అక్కడ పడేయవద్దని, మున్సిపల్ పారిశుద్ధ్య ట్రాక్టర్లకు అందించాలని సూచించారు. ఆవులు, ఎద్దులను తరలించకుండా జిల్లా సరిహద్దులోని భోరజ్, ఆనంద్‌పూర్, శంకర్‌గుట్ట, లక్ష్మీంపూర్, ఘన్‌పూర్‌ల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

'చలో ముధోల్' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న షకీల్

ఆదిలాబాద్‌అర్బన్: ఈనెల 19న నిర్వహించే చలో ముధోల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. షకీల్ అన్నారు. శనివారం స్థానిక ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని బోరిగాంలో ఈనెల 12న బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగిందని, దీన్ని జీర్ణించుకోలేని కొందరు దళితులపై దాడి చేశారని పేర్కొన్నారు. బుద్ధ విగ్రహాన్ని అక్కడి నుంచి ముధోల్ తహసీల్దార్ కార్యాలయానికి తరలించారని తెలిపారు. మహనీయుని పట్ల ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు సూర్యవంశీ, రన్యారావు, ప్రకాష్ సాల్వే, రాహుల్, మహేశ్, బాలాజీ, సచిన్ పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు సందర్శించిన అదనపు కలెక్టర్



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

జైనథ్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో శనివారం రోజున జొన్న కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతులు ఎలాంటి అధైర్య పడవద్దన్నారు. ఉమ్మడి మండలాల్లోని సత్నాల మండలంలోని మేడిగూడ గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే బోరజ్ మండల కేంద్రంలోని పిప్పర్వాడ గ్రామంలో సైతం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ఆత్రం నారాయణ, పీఏసీఎస్ సీఈవో గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రూకేష్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, బద్దం సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీధర్‌కుమార్

ఇంద్రవెల్లి: అకాల వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని, జొన్న కొనుగోలు కేంద్రం అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు సౌకర్యాలు కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సందర్శించి జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులతో మాట్లాడి ఇప్పటి వరకు కొనుగోలు చేసిన జొన్న పంట, రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. యార్డులో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన పంటను ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని సూచించారు. ఎరువులు, మందులు ఇప్పటికే ఫర్టిలైజర్ షాపులో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, వ్యవసాయాధికారి రాథోడ్ గణేష్, పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్, తుమ్మల సునీల్, లక్ష్మణ్, సురేశ్, ఏఈవో వీర పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతుకు శాపం



ఎండుతున్న టమాట పంట

గుడిహత్నూర్: ప్రభుత్వం ఉచితంగా కరెంటు అందిస్తుందన్న నమ్మకంతో రైతు సాగు చేస్తున్న టమాట పంట అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎండిపోయింది. దీంతో రూ.2 లక్షల మేర నష్ట పోయానని రైతు లబోదిబోమంటున్నాడు. మండలంలోని బెల్లూరి గ్రామానికి చెందిన కేంద్రే రాము గత మూడు నెలల క్రితం 2 ఎకరాల్లో మల్చింగ్ విధానంలో టమాట సాగు చేశాడు. ఇంతవరకు ఓకే కాని ఆయనకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ సబ్ స్టేషన్‌కు చెందిన ఫీడర్ ఇచ్చోడ మండలంలోని గాంధీనగర్ వయా కామగిరి బెల్లూరికి డీటీఆర్‌కు వెళ్తుంది. ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) నిర్వహణ గుడిహత్నూర్ అధికారులు చూస్తుండగా ట్రాన్స్‌ఫార్మన్ ఫీడర్ నిర్వహణ ఇచ్చోడ మండలానికి చెందిన అధికారులు చూస్తున్నారు. దీంతో ఒకరి మధ్య ఒకరికి సమన్వయ లోపంతో గత కొన్ని నెలలుగా కరెంటు సరిగా రావడంలేదని సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులకు విన్నవించుకున్నా.. ఫలితం దక్కలేదు. ఫలితంగా కళ్లముందే ఎండుతున్న పంటను చూసి ఆవేదవ వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాడు.

పాఠశాల కంప్యూటర్ అపహరణ



పగిలి ఉన్న బీరువా

సాత్నాల: మండలంలోని మేడిగూడ(ఆర్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ చోరీకి గురైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యవాన్ చిక్లే తెలిపారు. శుక్రవారం రాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల మెయిన్ గేట్ తాళం పగలగొట్టి స్టాఫ్ రూంలోకి వెళ్లి మద్యం సేవించారు. మద్యం బాటిళ్లను అక్కడే వదిలిపెట్టి వెళ్లారు. ఉదయం వాచ్‌మెన్ వచ్చి చూడగా పాఠశాల గేట్ తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి ప్రధానోపాధ్యాయుడికి సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన పాఠశాలకు చేరుకుని బీరువాలు పగులగొట్టి ఉండటంతో చోరీకి గురైనట్లుగా నిర్ధాయించారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మద్యం బాటిల్‌లో ఉన్న ఫింగర్ ప్రింట్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు.

జీపీఎఫ్ లోన్లు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: జిల్లాలోని ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్‌ను త్వరితగతిన మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ము కృష్ణకుమార్, నరసింహ స్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత రెండేళ్లుగా లోన్లు మంజూరు కాకపోవడంతో ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. వడ్డీరేట్లకు సంబంధించి సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ చేయించి జిల్లాకు సంబంధించి పేస్లిప్స్ వచ్చేలా చూడాలని విన్నవించారు.

నిరుపేద యువతి పెళ్లికి ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న గిత్తే మదన్

గుడిహత్నూర్: మండలంలోని ముత్నూర్‌తండాకు చెందిన జాదవ్ ప్రేందాస్ గత 5 ఏళ్లుగా అనారోగ్యంతో మంచం పట్టాడు. తన ఐదుగురు కుమార్తెల్లో పెద్ద కుమార్తె వివాహం జరగనుందని దీనికి కుటుంబం అనేక ఆర్థిక సమస్యలతో సతమతమవుతుందనే విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త, స్థానిక జై దేవి మెడికల్ యజమాని గిత్తే మదన్ పెద్ద కూతురు వివాహానికి ఆర్థిక సాయంతో పాటు పెళ్లికి అవసరమయ్యే నిత్యావసర సరుకులు అందించి ఉదారత చాటుకున్నారు. ఇదే కాదు అనేక పేద వివాహాలే కాకుండా అవసరమైన వారికి ఆర్థికంగా వస్తు రూపేణ సాయం అందించిన గిత్తే మదన్‌ను స్థానికులు అభినందిస్తున్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న కుమ్ర ఈశ్వరీబాయి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తిప్ప గ్రామానికి చెందిన బాలింత ఆత్రం రాణిబాయి గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి శనివారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చనిపోయిన గర్భిణికి నెల రోజుల పసి పాప ఉండగా పాప ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పసితనంలోనే పాప తల్లికి దూరమవడం చాలా బాధాకరమన్నారు. పాప పాల కోసం అవుని విరాళంగా ఇస్తానని, ధైర్యంగా ఉండాలని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో కుమ్ర రాజు, ఇంద్రవెల్లి మాజీ ఎంపీటీసీ గిత్తే ఆశబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సింధూర పూజ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్ శ్రీ హనుమాన్ మందిరంలో శనివారం సింధూర పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దీక్షదారులు భక్తి గీతాలతో పూజా కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. దీక్షదారులు మహేశ్, మల్లేష్, శేఖర్, నరసయ్య, సౌరబ్, వికాస్, కిరణ్, అరుణ్, నవీన్, లడ్డు, సతీష్ యాదవ్, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ పల్లకి ఊరేగింపు

తాంసి: మండల కేంద్రంలో శనివారం హనుమాన్ దీక్షదారులు హనుమాన్ పల్లకి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పూలతో అలంకరించిన పల్లకిలో హనుమాన్ ఉత్సవమూర్తిని ఉంచి హనుమాన్ ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభించారు. గ్రామంలోని ప్రధానవీధుల గుండా పల్లకిని భజనకీర్తనలతో శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు సతీష్, రాకేశ్, రాజు, సాయికుమార్, కృష్ణ, జూకంటి సతీశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



ఇళ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: ఈదురు గాలులతో కురుసిన వర్షానికి ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయిన బాధితులను ఆదుకోవాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయిన విషయం తెలుసుకొని శనివారం ధర్మసాగర్ గ్రామాన్ని సందర్శించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి నష్టం వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జైస్వాల్ శివకుమార్, మస్కే రాజువర్ధన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఎక్స్‌రోడ్డు గ్రామానికి చెందిన రైతు చాకటి లక్ష్మణ్‌కు చెందిన ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. శుక్రవారం రాత్రి గాలివాన కురియగా విద్యుత్ తీగలు కిందపడి ఉండగా.. మేతకు వెళ్లిన ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆవు విలువ రూ. 50 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రవి కోరారు. శనివారం మండల కేంద్రంలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. భవన నిర్మాణ కేంద్ర చట్టం–1996, అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టం– 1979 కాంట్రాక్ట్ కార్మికుల చట్టం–1970 లను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బొజ్జరాజ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..!



భోరజ్ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నేషనల్ హైవే 44 నుంచి కిలోమీటర్ మేర ఉన్న ఈ రహదారిపై ప్రయాణిస్తే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైతే గుంతలలో నీరు చేరి మరిన్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– సాత్నాల